# జమ్మూ - కాశ్మీర్‌లోని మానవహక్కుల పరిస్థితిపై నిజనిర్ధారణ బృందం నివేదిక

అయిదు పౌర, ప్రజాస్వామిక, మానవహక్కులకు చెందిన 11 మందితో కూడిన ప్రతినిదుల బృందం జమ్మూ - కాశ్మీర్ రాష్ట్రంలోని హక్కుల పరిస్థితి పరిశీలించడానికి 22.5.2001 నుండి 31.5.2001 దాకా కాశ్మీరులోయలోని పుల్‌వామా, ఎనగర్, బడ్‌గామ్, బారాముల్లా జిల్లాలోని 8 గ్రామాలు మరియు సోపోర్, శ్రీనగర్ పట్టణాలు, జమ్మూ ప్రాంతంలోని దోడా జిల్లాలోని కిష్టవార్ ప్రాంతం, దోడా తహసిల్‌లోని మరో రెండు గ్రామాలు పర్యటించింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో ప్రజలతో, మేధావులతో, జర్నలిస్టులతో, రాజకీయ నాయకులతో, సంఘ సేవకులతో, ప్రభుత్వ ఉన్నతాధికారులతో, హైకోర్టు అడ్వకేట్స్‌తో, పోలీసు అధికారులతో, యూనివర్సిటీ విద్యార్థులతో, ప్రొఫెసర్స్‌తో చర్చించింది. ప్రధానంగా హక్కుల ఉల్లంఘనకు చెందిన తొమ్మిది ముఖ్య సంఘటనలను ఈ బృందం విచారించి సాక్ష్యాలు నమోదు చేసింది. వేద్‌భాసిన్, బలరాజ్‌పురిలాంటి ప్రముఖవ్యక్తులను, ఆల్‌పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ నాయకులైన అబ్దుల్‌గనీ లోనె, అబ్దుల్ గనీ భట్, షబీర్‌షా, ఎం.ఎల్.ఏ మహబూబా ముఫ్తిని కలిసి వారి అభిప్రాయాలు సేకరించింది. చర్చించింది. జె అండ్ కె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అశోక్‌జైట్లీని, పుల్వామా జిల్లా ఎస్ఎస్‌పిని, డిప్యూటీ కమీషనర్ (కలెక్టర్)ని కలిసింది. అదృశ్యం అయిన వ్యక్తుల తల్లితండ్రుల్ని సంఘం బాధ్యులను కలసింది.

మా యొక్క పర్యటన పరిశీలనాంశాలను వెల్లడించే ముందు ఒక విషయం ప్రజల దృష్టికి తేవడం మంచిదని మేము భావిస్తున్నాం. 28.11.2000న భారత ప్రభుత్వం ఏకపక్షంగా మిలిటెంట్లతో కాల్పుల విరమణ ప్రకటించింది. కాల్పుల విరమణ అంటే "నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కంబాట్ ఆపరేషన్" (ఎన్.ఐ.సి.ఓ) అని ప్రభుత్వం దీనిపై వివరణ ఇచ్చింది. అంటే భద్రతాదళాలు తమంత తాముగా మిలిటెంట్లపై దాడులు జరుపమనీ, మిలిటెంట్స్ తమపై దాడి చేస్తే మాత్రం వదిలేదిలేదనీ దీని అర్థం. ఇది కాశ్మీర్ సమస్య పరిష్కారానికి భారత ప్రభుత్వం చొరవతో పరిష్కారం కోసం తన నిజాయితీని ప్రదర్శించినట్లు మనం భావించవచ్చు. అయితే ఆశ్చర్యకరంగా 28.11.2000న జమ్మూ - కాశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎ.కె. సూరి పత్రికల వారితో మాట్లాడుతూ, నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కంబాట్ ఆపరేషన్స్" అనేవి కేవలం భద్రతా దళాలకు మాత్రమే సంబంధించిందనీ, రాష్ట్ర పోలీసులకు, ఆ పోలీసు దళాల నుంచి రూపొందించబడిన స్పెషల్ ఆపరేషన్ (ఎస్.ఓ.జి)కు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్.టి.ఎఫ్)కు వర్తించవని వెల్లడించడం జరిగింది. అనేక చోట్ల ఆర్మీక్యాంపుల స్థానంలో ఎస్.ఓ.జి క్యాంపులు వెలిశాయి. కాల్పుల విరమణ ప్రకటించిన మొదటి నెల మాత్రమే ఎంతో కొంత ప్రభుత్వ ప్రకటన అమలయిందనీ, ఆ నెల రోజుల తరువాత ఆర్మీతో సహా సీజ్‌ఫైర్ అమలు చేసిన దాఖలాలు లేవని వివిధ శ్రేణుల ప్రజలు నిజనిర్ధారణ కమిటీతో అన్నారు. ప్రభుత్వ ప్రకటనను వివిధ భద్రతా దళాల కమాండర్లు అర్థం చేసికొన్న తీరులో చాలా తేడాలున్నాయని మా పరిశీలనలో అర్థం అయ్యింది. అధిక శాతం ప్రజలు ఒక్క విషయం మాత్రం అంగీకరిస్తున్నారు. సీజ్‌ఫైర్ అనేది నిజాయితీగా ఎక్కడయినా అమలయిందంటే అది కేవలం వాస్తవాధీన రేఖ ప్రాంతంలో మాత్రమే.

## హక్కుల ఉల్లంఘన సంఘటనలు కేటగిరి వారీగా

### 1 కస్టడీ హత్యలు

ఎ) 21.2.2001న పుల్‌వామా జిల్లాలోని హాగమ్ వద్ద ఉన్న రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు షోపియాన్ తహసిల్‌కి చెందిన మోహన్‌పురా గ్రామానికి చెందిన జట్కా బండి తోలుకొని జీవించే గులామ్ మొహియుద్దీన్ పండిట్ అనే 65 సం॥ల వృద్ధుడనీ, మంజూర్ అహమ్మద్‌ఖాండీ అనే యువకుడిని విచారించాలని క్యాంపుకు పిలువనంపి సాయంత్రం 3 నుంచి 5 గం॥ల వరకు దారుణంగా హింసించడంతో మరుసటి రోజు ఆ వృద్ధుడు మరణించాడు.

బి) 19.5.2001న శ్రీనగర్‌లోని బుచ్‌పురా ప్రాంతంలోని ఇలాహిబాగ్‌కి చెందిన మాజీ మిలిటెంట్ ఇజాజ్ అహమ్మద్ కితాబ్ అనే మాజీ మిలిటెంటును, షబీర్‌షాకు చెందిన డెమోక్రాటిక్ ఫ్రీడం పార్టీ కార్యాలయం నుంచి వెలుపలికి వస్తుండగా కార్యాలయం వెలుపల ఎస్ఓజి పోలీసులు నిర్బంధించి తీసికొని వెళ్ళారు. ఇకతాబ్ 1.4.2001న ఒక లేడీ కానిస్టేబుల్‌ను వివాహం చేసుకొన్నాడు. మిలిటెంట్ జీవితానికి స్వస్తి చెప్పి షబీర్‌షా పార్టీలో చేరి దాని కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. 19.5.2001న అతనిని తీసికొని వెళ్ళి రాత్రి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథనం వల్లిం చారు. మాజీ మిలిటెంట్ అయిన అతనిని ఎస్ఓజి లేదా ఎస్‌టిఎఫ్ లేదా భద్రతా దళాలు చంపకుండా ఉండడం కోసం అతని భార్య తన ఉన్నతాధికారులతో సంప్రదించి ఒక గుర్తింపు కార్డు కూడా సంపాదించింది. అయితే అతనిని నిర్బంధించిన సమయంలో అతని వద్ద ఆ కార్డు లేకపోవడంతో అతనిని ఎస్ఓజి పోలీసులు హత్యచేసారు.

సి) 17.5.2001న శ్రీనగర్‌లోని దరీష్‌కడల్ ప్రాంతంలో మహమ్మద్ ఇస్మాయిల్ కాలూ అనే యువకుడిని ఉదయం 10 గం॥ల ప్రాంతంలో నిర్బంధంలోకి తీసుకొన్నారు. అతనిచ్చిన సమాచారం ఆధారంగా నియాజ్ అహమ్మద్‌షా అనే మరో మిలిటెంట్‌ని ఎస్ఓజి అధికారులు అదుపులోకి తీసుకొన్నారు. వీరిద్దరినీ తీసికొని, మహమ్మద్ ఇస్మాయిల్ కాలూ ఇంటికి వచ్చి అక్కడ సోదా చేసారు. ఇంటిని కొంత ధ్వంసం చేశారు. అదే రోజు రాత్రి వారిద్దరినీ చంపివేసి "ఎన్‌కౌంటర్"గా ప్రకటించారు.

డి) పుల్‌వామా జిల్లాలోని షోపియాన్ తహసిల్ ప్రాంతంలో గల డాగ్‌పోరా గ్రామానికి చెందిన ఇంటర్ మీడియెట్ విద్యార్థిని (17 సం॥) కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా బిఎస్ఎఫ్ జవానులు అదుపులోకి తీసుకున్నారు. (17.5.2001)న అదే రోజు రాత్రి డోంగాం అనే మరో గ్రామంలో రాత్రి సమయంలో మూత్రవిసర్జన కోసం ఇంటి వెలుపలికి వచ్చిన మహమ్మద్ సయ్యద్ మాలిక్ అనే మరో 18 సం॥ల బాలుడిని కూడా బిఎస్ఎఫ్ వారు అదుపులోకి తీసుకొన్నారు. వారిరువురినీ ఆ రాత్రి కాల్చి చంపి అబ్దుల్ రషీద్ షేక్ అనే అతని ఇంటిగోడ ప్రక్కన శవాలుంచి మిలిటెంట్లతో జరిగిన ఎదురుకాల్పులలో తాము వారిని హతమార్చామని ప్రకటించారు. డాంగాం గ్రామ ప్రజలు చూసినపుడు షేరజ్ అహమ్మద్‌ఖాన్ కాళ్ళు, చేతులు విరిచి కట్టివేయబడి ఉన్నాయి. ఈ హత్యకు నిరసనగా షేరాజ్ సహ విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శన జరిపారు.

పై నాలుగు సంఘటనలలో మొదటి మూడు సంఘటనలలో హతులను పోలీసులు తీసికొని వెళుతుండగా చూసిన ప్రత్యక్ష సాక్షులున్నారు. చివరి సంఘటనకు మాత్రం ప్రత్యక్ష సాక్షులు లేరు. హతుల కుటుంబాల కథనం ఆధారంగా కమిటీ ఈ నిర్ణయానికి వచ్చింది.

### 2. ప్రతీకార హత్యలు

ఎ) 8.2.2001న బారాముల్లా జిల్లాలోని సోపోర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మిలిటెంట్స్ ఒక గ్రెనేడ్ పేల్చారు. అయితే ఎవ్వరూ గాయపడలేదు. కాని ఆ ప్రాంతంలో ఉన్న బిఎస్ఎఫ్ జవానులు రెచ్చిపోయి ప్రజలపై కాల్పులు జరిపారు. ప్రజలు ఇళ్ళలోకి వెళ్ళి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దక్కించుకున్నారు. అయితే ఒక సంపన్న కుటుంబానికి చెందిన టీ వ్యాపారి షకీల్ అహమ్మద్‌బుల్లా అనే వ్యక్తి బజారు నుంచి సరుకులు తీసికొని వీధిలో ప్రవేశిస్తుండగా బిఎస్ఎఫ్ జవానులు కాల్చడంతో గాయపడ్డాడు. అతడిని బిఎస్ఎఫ్ జవానులు ఈడ్చి తమ వాహనంలో వేసికొని కొంత సేపటి తరువాత అడగగా ఎ.ఎన్.సింగ్ అనే బిఎస్ఎఫ్ జవాను, బుల్లాక్రాస్ ఫైరింగ్‌లో గాయపడ్డాడని జవాబివ్వడం జరిగింది. అయితే గాయపడ్డ బుల్లా దానిని తిరస్కరించి అసలు క్రాస్‌ఫైరింగ్ జరగలేదనీ అన్యాయంగా కె.ఎన్.సింగ్ తవని కాల్చాడవి చెప్పడం జరిగింది. దీనికి ఆగ్రహించిన కె.ఎన్.సింగ్ గాయపడ్డ బుల్లాను డాక్టరు సమక్షంలోనే మరోసారి హింసించడం జరిగింది. ప్రాథమిక చికిత్స తరువాత దగ్గరలో మంచి మిలటరీ హాస్పిటల్ అందుబాటులో ఉన్నా, అతనిని బిఎస్ఎఫ్‌వారు ఆలస్యంగా శ్రీనగర్‌కు తరలించారు. ఎ.ఎన్.సింగ్ చేసిన అభ్యర్థన మేరకు బుల్లాను తీసికొని వెళుతున్న వ్యాన్‌ను మధ్యలో ఒక గంట నిలిపివేశారు. అందువల్ల రక్తస్రావం ఎక్కువగా జరిగి నష్టపోవడంతో బుల్లా శ్రీనగర్ చేరేసరికి మరణించాడు.

> **నిజ నిర్ధారణ కమిటీ బృందం వివరాలు**
>
> పి.యు.డి.ఆర్. ఢిల్లీ నుంచి : షహనా భట్టాచార్య, బేలా భాటియా, రాకేష్ శుక్లా, డా॥ ఉమాచక్రవర్తి, డా॥ స్వాతిజోషి
>
> ఓ.పి.డి.ఆర్. (ఏ.పి) నుంచి ఎం.వి. క్రిష్ణయ్య,
>
> పి.డి.ఎఫ్. (కర్నాటక) నుంచి షకీల్,
>
> ఏ.పి.సి.ఎల్.సి. నుంచి ఎ. దశరథ్, డి. సురేష్‌కుమార్,
>
> హెచ్.ఆర్.ఎఫ్. (ఏ.పి) నుంచి బి. రాములు, డా॥ కె. బాలగోపాల్

బి) 9.5.2001న బడ్ గామ్ జిల్లాలోని శ్రీనగర్ గుల్‌మార్గ్ రహదారిపై గల మాగమ్ పట్టణంలో షౌకత్ అహమ్మద్ ఖండీ అనే ఫిదాయిన్ దళ సభ్యుడు (ఆత్మాహుతి దళ సభ్యుడు) ఐస్‌క్రీం బండిలో ప్రేలుడు పదార్థాలుంచుకొని బిఎస్ఎఫ్ క్యాంపు వద్దకి వెళ్ళి ఒక బిఎస్ఎఫ్ ఉన్నతాధికారి ప్రక్కకు వెళ్ళి దానిని పేల్చివేయడంతో వారిరువురూ మరణించారు. అందుకు ప్రతీకారంగా బిఎస్ఎఫ్ జవానులు రెచ్చిపోయి ప్రజలపై జరిపిన కాల్పులలో '8' మంది సాధారణ పౌరులు మరణించారు. అయితే బిఎస్ఎఫ్ అధికారులు వారందరూ మిలిటెంట్ పేల్చిన బాంబువల్ల మరణించారని వాదిస్తున్నారు. అయితే సంఘటనా స్థలానికి చాలా దూరంలో ఒక ఆటోరిక్షా డ్రైవర్ గులామ్ మహమ్మద్‌దార్, మరియు రోడ్డుపై నడుస్తున్న మరో పౌరుడు బిఎస్ఎఫ్ జవానుల ప్రతీకార కాల్పులలో మరణించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బిఎస్ఎఫ్ జవానులు ఒక బస్‌పై కూడా కాల్పులు జరిపారు. అదృష్టవశాత్తు అందులో ఎవరూ గాయపడలేదు.

భద్రతా దళాలపై మిలిటెంట్లు దాడి చేసినపుడు దానికి ప్రతీకారంగా ప్రజలపై కాల్పులు జరపడం కాశ్మీరు వ్యాలీలో సాధారణ అంశమయింది. ప్రభుత్వం ప్రకటించిన కాల్పుల విరమణను భద్రతా దళాలు ఎంత అద్భుతంగా అమలు చేస్తున్నాయో మనకి అర్థం అవుతుంది. ఈ దారుణ సంఘటన అంతర్జాతీయ స్థాయిలో వెల్లడయినా దోషుల మీద ఈ రోజుకీ ఎటువంటి చర్యా తీసుకోలేదంటే భారత పాలకుల శాంతి గురించీ, చట్టబద్ధ పాలన గురించీ వారు చేసే ప్రకటనలలోని నిజాయితీని మనం అర్థం చేసుకోవచ్చు. ప్రజలు ప్రభుత్వ విధానాల ఎడల ఎంత ఆగ్రహంతో ఉన్నారంటే సంఘటన మే 9న జరిగితే మా టీమ్ ఆ గ్రామం సందర్శించే వరకూ నిరవధికంగా దుకాణాలు మూసి బంద్ నిర్వహిస్తున్నారు.

బారాముల్లా జిల్లాలోని సోపోర్ తహసిల్ ప్రాంతంలోని హైగామ్ గ్రామానికి చెందిన మాజీ మిలిటెంట్ జలీల్ మహమ్మద్ షా ప్రతిరోజూ సమీపంలోని రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపుకు వెళ్ళి సంతకం చేసి వస్తుంటాడు. 13.2.2001న అతడిని రాష్ట్రీయ రైఫిల్స్ జవానులు అదుపులోకి తీసికొని 14న అతడి మృతదేహాన్ని బారాముల్లా స్టేడియం వద్ద పడవేశారు. దీనికి నిరసనగా ప్రజలు శ్రీనగర్ - బారాముల్లా రహదారిపై గుమికూడి నిరసన ప్రదర్శన చేసారు. (15.2.2001) అదే సమయంలో ఆ రహదారిపై ప్రయాణిస్తున్న ఆర్మీ వారు ఆగ్రహించి ప్రజలపై లాఠీఛార్జీకి దిగగా సోపోర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సైనికులను నివారించి ప్రజలతో తనకు సత్‌సంబంధాలున్నాయనీ తాను వారికి నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపచేస్తానని బ్రతిమిలాడినా, ఆర్మీ జవానులు వినిపించుకోకుండా ప్రదర్శన కారులపై కాల్పులు జరపగా 4గురు పౌరులు మరణించారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా వున్నారు.

కాశ్మీరులో సైనిక పాలన లేదు. చట్ట ప్రకారం ఇప్పటికీ అక్కడ పౌరపాలనే ఉంది. ఒక ప్రాంతంలో పౌరపాలన ఉండి అక్కడి శాంతిభద్రతల పరిస్థితిని వారు అదుపు చేయలేకపోయినపుడు మిలటరీని సాయంగా పిలవవచ్చు. కానీ మిలటరీ కేవలం స్థానిక పోలీసులకు సాయంగా ఉండాలి తప్ప పోలీసులపై పెత్తనం చేసే అవకాశం లేదు. కానీ మొత్తం జమ్మూ - కాశ్మీర్ రాష్ట్రంలో దీనికి పూర్తి భిన్నంగా పోలీసుల అధికారాలను చట్టవ్యతిరేకంగా భద్రతా దళాలు ఆధిపత్యం వహించి పెత్తనం చేస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో మౌనం వహిస్తున్నది.

### 3. మహిళలపై అత్యాచారాలు

ఎ) బారాముల్లా జిల్లాలోని కెరీరీ పోలీస్ స్టేషన్ పరిధిలోగల అలామ్ వారిపారా గ్రామంలో 13.4.2001 రాత్రి రాష్ట్రీయ రైఫిల్ దళాలకు చెందిన జవానులు ఇళ్ళను సోదా చేయాలనే పేరిట ఇళ్ళలో చొరబడి ముగ్గురు యువతులను ఎత్తుకొని వెళ్ళడానికి ప్రయత్నించారు. వీరిని అడ్డగించిన మొహమ్మద్ సుల్తాన్ ఆలీ (65) అనే వృద్ధుడిని, గులామ్ హసన్ ఆలీ (28) అనే యువకుడిని కాల్చి చంపారు. గులామ్ హసన్ ఆలీ తల్లిని కాలిపై కాల్చారు. నజీర్ అహమ్మద్ అనే 1 1/2 సం॥ల పసిబిడ్డకు అతడి తల్లికి కూడా తుపాకి గాయాలయ్యాయి. ఆ గ్రామంలో భీభత్సం సృష్టించిన రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు ముగ్గురు యువతులను తీసికొని వెళ్ళి వారిపై సామూహిక అత్యాచారం చేసారు. ఈ విషయం పక్క గ్రామాలకు తెలిసి మరుసటి రోజు శ్రీనగర్ బారాముల్లా రోడ్డుపై భారీ సంఖ్యలో జనం '6' గంటల పాటు రాస్తారోకో చేసిన తరువాత మాత్రమే ఆ ముగ్గురు యువతులను విడుదల చేసారు.

బి) దోడా జిల్లాలో సైనిక దళాలూ, ఎస్‌టిఎఫ్ పోలీసులకు స్త్రీలను అపహరించి అత్యాచారం చేయడం రోజువారీ కార్యక్రమం. మేము

ఒక్కరోజు దోడా ప్రాంతంలో ఉంటే అత్యాచారాలు చేసిన 20 సంఘటనలు ప్రజలు మా దృష్టికి తీసికొని వచ్చారు. ఆ ప్రాంతాలకి మొదటిసారి పోయిన హక్కుల బృందం మాది మాత్రమే. ఈ అత్యాచారాల విషయంలో ప్రజలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, దానిపై విచారణ జరగడం అనేది అరుదు. చాలా సందర్భాలలో అత్యాచారం చేసినవారు అత్యాచారానికి గురయిన కుటుంబాలపై వత్తిడిచేసి ఆరోపణలను ఉపసంహరించుకొనేటట్లు చేయడం సాధారణం. 322 ఎడిఎకి ఆర్మీ జవానులు దోడా జిల్లా నివాసి 43 సం॥ల రాజాబేగం అనే మహిళను, ఆమె కుమార్తె గుల్షాన్ బాన్‌ను ఇంటిపై దాడి చేసి గోహ వద్ద ఉన్న వారి క్యాంపుకు తీసికొని వెళ్ళారు. అక్కడ 5 రోజులు నిర్బంధంలో ఉంచి కళ్ళకు గంతలు కట్టి అయిదు రోజులూ సామూహిక అత్యాచారం చేసారు. ఆ తరువాత ఆ తల్లీ కూతుళ్ళను దోడా జిల్లాలోని భడేర్వా పోలీసు స్టేషన్‌కి అప్పగించారు. అక్కడ పోలీసులు వీరిని మరో 8 రోజులు నిర్బంధించారు. ఆ మహిళలపై వైద్య పరీక్షలు జరిపారు. అన్ని సాక్ష్యాధారాలు తారుమారు చేయబడ్డాయి. ప్రజలు ఈ అత్యాచారం పై భారీ నిరసన తెలియజేసిన తర్వాత మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. ఈ రోజుకీ విచారణ కొనసాగడంలేదు. ప్రస్తుతం రాజాబేగం కొడుకుని తరచుగా జాయింట్ ఇంటరాగేషన్ సెంటరుకు పిలిపించి బెదిరిస్తూ కేసు ఉపసంహరించుకోమని వత్తిడి చేస్తూ హింసిస్తున్నారు. సాక్ష్యాలు ఇవ్వకూడదని బెదిరిస్తున్నారు.

సి) అక్టోబరు 29 రాత్రి అమీనా అనే వివాహిత యువతిని బీహార్ రెజిమెంట్ జవాన్లు అదుపులోకి తీసుకొని వెళ్ళిన దానికి నిరసనగా, అమీనాని విడుదల చేయాలని కోరుతూ 30.10.2000న 25 - 30 మంది మహిళలు, 8 - 9 మంది పురుషులు బాటుంగల్ క్యాంప్‌కి వెళ్ళారు. అలా వెళ్ళిన మహిళలను శిబిరంలోని సైనికులు దారుణంగా అవమానించి 5 గంటల తరువాత మాత్రమే బయటకు పంపారు. పురుషులను నిర్బంధించి చిత్రహింసలపాలు చేసారు. పౌరప్రతినిధులు జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్ళి న్యాయం చేయమని కోరారు. నేటికీ ఏ చర్యా తీసుకోబడలేదు.

## 4. చిత్రహింసలు - వెట్టిచాకిరి

జమ్మూ ప్రాంతంలోని దోడా జిల్లా పూర్తిగా పర్వత ప్రాంతం. ఇది మొత్తం కాశ్మీరులో వైశాల్యానికి సమానంగా ఉంటుంది. ఇక్కడ మొత్తం పర్వత ప్రాంతం కావడంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళడం చాలా శ్రమతో కూడినది. ఆర్మీ, పోలీసు దళాల నిరంతర నిఘా వల్ల ఇక్కడి వార్తలు సహితం బయటి ప్రపంచానికి తెలియవు. ప్రజల నుంచి ఆర్మీపై, పోలీసు బలగాలపై వచ్చే ఆరోపణల సారాంశాన్ని ఇక్కడ క్లుప్తంగా ఇస్తున్నాం. పైసా డబ్బు చెల్లించకుండా స్థానిక ప్రజలచేత భద్రతా దళాలు చాకిరీ చేయించుకోవడం, ప్రజలను చిత్రహింసలు పెట్టడం ఇక్కడ సాధారణ అంశం. ఒక ఆర్మీ క్యాంప్ లేదా ఎస్ఓజి క్యాంప్ ఉందంటే ఆ చుట్టు ప్రక్కల ప్రజలు వారి అవసరాలు తీర్చాల్సిందే. క్యాంపు ఆవరణ శుభ్రం చేయడం, క్యాంపు నిర్వహణకు అవసరమైన కలపను అడవుల నుంచి తెచ్చి అందించడం వారి బాధ్యతే. చలికాలంలో క్యాంపులోని మంచుసహితం గ్రామస్తులే తొలగించాలి. ప్రజలను రోజుల తరబడి క్యాంపులలో అట్టిపెట్టుకోవడం, వారి చేత పనులు చేయించుకోవడం, కోపం వచ్చినపుడు వారిని హింసించడం క్యాంపులలో సహజం. మా బృందం ఒక కొండ నుంచి దాని దిగువన గల బిహోటా గ్రామానికి తిరిగి వస్తుండగా నలుగురు యువకులు ఒక భారీ ఆయిల్ డ్రమ్‌ను కొండపై (2 కి.మీ. పైగా ఎత్తున ఉన్న) నున్న 8 రాష్ట్రీయ రైఫిల్స్ శిబిరానికి మోసుకొని వెళుతుండగా చూసాము. గోహా గ్రామంలో కూడా ఐఓఆర్ క్యాంప్ ఉంది. అందులోని జవానులు లోతట్టు గ్రామాల ప్రజలు తెచ్చిన కలపను తమ క్యాంపులోకి తీసికొనివెళ్ళడం మేము గమనించాము.

బిహోటా వద్ద ఉన్న ఆర్మీ క్యాంపు, సీజ్‌ఫైర్ తరువాత ఎస్.ఓ.జి ఆధీనంలోకి వచ్చింది. సీజ్‌ఫైర్ ఆరునెలల కాలంలో ఎస్ఓజీ పోలీసులు ఒక్క భోజనం కూడా తమ స్వంత ఖర్చులతో తినలేదని స్థానిక ప్రజలు ఆరోపించారు. భోజనం సమయానికి ఏదో ఒక గ్రామంపై దాడిచేసి మిలిటెంట్ల కోసం వెతుకుతున్నాం" అంటూ గాలిలోకి తుపాకులు పేల్చడం, ప్రజలను భయభ్రాంతులను చేసి ఆ తరువాత తమకి భోజనం తయారుచేసి తెమ్మని వత్తిడిచేయడం, వారికి రోజువారీ కార్యక్రమంగా మారిందని ప్రజలు కమిటీతో చెప్పడం జరిగింది. భద్రతా దళాల క్యాంపులలో పోలీసు స్టేషన్లలో మరియు జాయింట్ ఇంటరాగేషన్ సెంటర్లలో తీవ్రస్థాయిలో ప్రజలను చిత్రహింసల పాలు చేస్తున్నారు. మనుషులను తలక్రిందులుగా వేలా డదీసి కొట్టడం, వారి తలలను నీటిలో ముంచి ఊపిరి ఆడకుండా చేయడం, రోలర్ ట్రీట్‌మెంట్ యివ్వడం, కరెంట్‌షాక్‌లు ఇవ్వడం ఇక్కడ మామూలు కార్యక్రమం. నిర్బంధంలోకి తీసుకొన్న వారికి అతిస్వల్ప ఆహారం ఇవ్వడంలేదా రోజుల తరబడి తిండిలేకుండా మాడ్చడం వారికి అలవాటు.

దోడా జిల్లా ప్రజలు చెప్పే దాని ప్రకారం భద్రతాదళాలు లేదా పోలీసు బలగాలు గ్రామాలపై దాడులు చేసినపుడు ఇళ్ళను పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసం చేయడం, ఇంటిలోని సామానులు, ఆహార పదార్థాలు పాడు చేయడం సర్వసాధారణం.

మా కమిటీ డిమాండ్లను ప్రకటించే ముందు అధికారుల ముందు మేము నాలుగు విషయాలను ఉంచదలచాము. 1. మానవ హక్కులను సాయుధ బలగాలు ఉల్లంఘించాయన్న ఫిర్యాదులపై పౌర, మిలటరీ అధికారుల స్పందన, 2. ఐఇడి లాంటి ప్రేలుడు పదార్థాలను, మిలిటెంట్లు జనసమర్థ ప్రదేశాలలో ఉంచి ప్రజలకు కలగజేస్తున్న అపాయాలు, 3. ప్రజలకు వ్యతిరేకంగా సైన్యం ఉపయోగిస్తున్న మందు పాతర్లు, 4. ప్రస్తుతం సాగుతున్న రాజకీయ ప్రక్రియ గురించి ప్రజల అభిప్రాయం.

ఇటీవలి కాలంలో ప్రజలపై సైనిక దళాలు అత్యాచారాలు చేసిన కొన్ని ఎంపిక చేసిన సంఘటనలపై చర్య తీసుకొని ఆ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించాయి. అవి మాగామ్ కాల్పులు, దానికి నిరసనగా మాగమ్‌లో జరిగిన ప్రదర్శన సందర్భంలో పత్రికా విలేకరులపై సైనికులు జరిపిన దౌర్జన్యం, ఆలియా వారిపోరాలో స్త్రీలపై అత్యాచారం చేసిన సంఘటన. ఈ తీసుకొన్న చర్యలు అసలేమీ చర్యతీసుకోని సందర్భాలతో పోలీస్తే నయమే. కానీ సంఘటనపై విచారణ జరపాలి, దోషులను శిక్షించాలి అనే అంశం పూర్తిగా సైనిక దళాల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉందని అర్థం అవుతున్నది. సైనిక దళాలు అక్రమంగా కాల్పులు, లేదా అత్యాచారాలకు పాల్పడినపుడు దానికి నిరసనగా భారీగా ప్రజలు నిరసన తెలియజేసినపుడు లేదా వాటి గురించి పత్రికలలో బాగా ప్రచారం అయిన సంఘటనలను ఎంచుకొని వాటి విషయంలో మాత్రమే విచారణ జరుపుతున్నారు. కానీ దోడా, రాజోరి, పూంచ్ లేదా ఇంకా లోతట్టు మారుమూల ప్రాంతాలైన కుప్‌వారాలాంటి ప్రాంతాలలో అక్కడి భౌతిక పరిస్థితుల రీత్యా అక్కడ అత్యాచారాలకు నిరసనగా భారీగా ప్రదర్శనలు జరిగే అవకాశమే లేదు. అటువంటి సందర్భాలలో వాస్తవాలు మిలటరీ ఉన్నతాధికారులకు తెలిసినా విచారణ జరుపకుండా మౌనం వహిస్తున్నారు. తమ దళాలచే హత్యలకు గురైన వ్యక్తులను మిలిటెంట్లుగా లేదా మిలిటెంట్లకు సంబంధించిన వ్యక్తులుగా ముద్రవేసి చేతులు దులుపుకొంటున్నారు. అటువంటి సంఘటనలపై ఎటువంటి చర్యా తీసుకోవడంలేదు. ఇటువంటి వాటికి మాగమ్ సంఘటన చక్కని ఉదాహరణ. మాగమ్ సంఘటనకు ముందు గ్రామస్తులను, భద్రతా దళాలు చంపిన విషయమై ఎటువంటి విచారణ లేదు. వారికి మిలిటెంట్లని ముద్రవేసారు. ఆ హత్యలకు నిరసనగా జరిగిన ప్రదర్శనను చిత్రిస్తున్న పత్రికా విలేకరులపై సైనిక దళాలు జరిపిన దౌర్జన్యంపై మాత్రమే విచారణ జరిపారంటే భద్రతాదళ అధికారుల ధోరణిని మనం అర్థం చేసుకోవచ్చు. భద్రతా దళాలు అదుపులోకి తీసుకొని ఆ తరువాత చంపిన "కస్టోడియల్ కిల్లింగ్స్"కి సంబంధించి ఏ ఒక్క సందర్భంలో కూడా అందుకు బాధ్యులైన వారిపై విచారణ జరుగలేదు. దీనికి కారణం ఒక్కటే, ప్రదర్శనలలో పాల్గొన్న ప్రజలందరినీ మిలిటెంట్లుగా నమ్మించడం సాధ్యంకాదు. కానీ కస్టోడియల్ కిల్లింగ్స్ విషయంలో ప్రతి హత్యనూ ఎదురుకాల్పులుగా ప్రకటించి వారిని తాము అదుపులోకి తీసుకోలేదని బుకాయించడం చాలా సులువు.

చట్టం ప్రకారం బలగాల ఆధీనంలో ఉన్న ఏ వ్యక్తి మరణించినా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చేత శాఖాపర దర్యాప్తు జరిపించాలి. పుల్‌వామా డిప్యూటీ కమీషనర్‌తోను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోనూ మేము కూలంకుషంగా జరిపిన చర్చల వలన ఇలాంటి విచారణ ఏదీ జరగటం లేదని స్పష్టమైంది. ఎంపిక చేసుకున్న చాలా తక్కువ కేసులలో మాత్రమే శాఖాపర దర్యాప్తు జరిగింది. మిగతా అన్ని కేసులలోనూ సైన్యం చెప్పింది వేదవాక్కుగా పరిగణించబడింది.

ఉల్‌వామా ఎస్ఎస్‌పితో మా చర్చల ద్వారా ఎదురుకాల్పులకు, హత్యలకు సంబంధించి ఒక విషయం తేటతెల్లం అయ్యింది. చనిపోయిన వ్యక్తి ఒక మిలిటెంటు అని, ఆత్మరక్షణార్థం బలగాలు జరిపిన కాల్పులలో అతను మరణించాడని, ఆ బలగాల అధికారులు చెప్పే విషయమే తిరుగులేని సత్యంగా పరిగణించబడుతుంది. కాని ఫిబ్రవరి 1997లో జాతీయ మానవహక్కుల సంఘం జారీ చేసిన సూచన నియమావళికి ఇది పూర్తిగా విరుద్ధం. ఈ నియమావళి ప్రకారం బలగాల అధీనంలో సంభవించిన ప్రతి మరణాన్ని నేరంగా పరిగణించి ఒక స్వతంత్ర సంస్థచే విచారణ జరిపించాలి. అనుల్లంఘనీయమగు ఈ నియమావళి జమ్మూ - కాశ్మీర్‌లో అనుసరించబడటం లేదు.

ఐఇడి లాంటి ప్రేలుడు పదార్థాలను బహిరంగ ప్రదేశాలలో మిలిటెంట్లు పేల్చడం వల్ల సాధారణ పౌరులకు తరుచుగా తీవ్రమైన మరియు ప్రాణాంతకమైన గాయాలు అవుతున్నాయి. జమ్మూ - కాశ్మీర్‌లో జరుగుతున్న ఘర్షణతో సంబంధంలేని ప్రజలను ఈ విధమైన గాయాలకు గురిచేయటం ఏ పరిస్థితులలోనూ క్షంతవ్యంకాని విషయం. ఈ చర్యలను మేం ఖండిస్తున్నాం.

మిలిటెంట్ల ఆకస్మిక దాడులను నిరోధించటం కోసం మిలటరీ కూడా వాటి కంటోన్మెంట్‌లు మరియు క్యాంపుల చుట్టూ మందుపాతరలను అమర్చుతుంది. సైన్యం యొక్క ఈ ముందు జాగ్రత్త చర్యను మేం అర్థం చేసుకోగలం. అయితే ఆ మందుపాతరలు పౌరులకు ప్రమాదం కల్గించే లక్షణాన్ని, అవకాశాన్ని కల్గియుండుటచేత వాటిని మేము అంగీకరించలేము. ఈ మందుపాతరల వలన గాయాలకు గురైన ఏ వ్యక్తిని మేము కలుసుకోలేకపోయినప్పటికీ అలాంటి మందుపాతరలవల్ల ఉఫ్‌క్వారా, బారాముల్లా జిల్లాలలో అనేక మంది పౌరులు చనిపోవటం, అంగవికలురు కావటం జరిగిందని మేము విన్నాం. యిలాంటి మందుపాతరలపై ప్రపంచవ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయడం కోసం ఐక్యరాజ్యసమితి ప్రయత్నం చేస్తున్న ఈ కాలంలో భారత సైన్యం వాటిని వినియోగించటం గర్హనీయం.

ప్రస్తుతం అక్కడ సాగుతున్న రాజకీయ క్రియ గురించి అన్ని సెక్షన్ల ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొన్నాం. వీరందరు భారత పాకిస్తాన్‌ల మధ్య జరగబోతున్న చర్చలపట్ల సానుకూల స్పందన కలిగి ఉన్నారు. అంతేగాక ఈ చర్చలలో జమ్మూ - కాశ్మీర్ ప్రజల ప్రతినిధులకు పాత్ర లేనట్లయితే ఆ చర్చలు అర్థరహితమని, అవి ఒక పార్సు మాత్రమే అవుతాయని ఎలాంటి మినహాయింపు లేకుండా చెప్పారు. జమ్మూ - కాశ్మీర్ ప్రజల ప్రతినిధులు ఎవరు అనే దానిపై మాత్రం ఏకాభిప్రాయం లేదు. ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ జమ్మూ - కాశ్మీర్ ప్రజల తగిన ప్రతినిధి అని కొందరు నమ్ముతుండగా మిగిలినవారు దానిని ఏమాత్రం అంగీకరించటంలేదు. అయితే చర్చలు శాంతియుత వాతావరణంలో జరగాలని నొక్కి వక్కాణించారు. ఆ చర్చలలో జమ్మూ - కాశ్మీర్ ప్రజలకు కూడా భాగస్వామ్యం ఉండాలని, ఆ చర్చల ఫలితంగా రూపొందే అంగీకారం ఏదైనా ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండాలని స్పష్టీకరించారు.

## ఇపుడు మా కమిటీ ఈ క్రింది డిమాండ్లను చేస్తుంది

1. కస్టడీ హత్యలను ఆపివేసి తీరాలి.

2. మిలిటెంట్లు సాయుధ బలగాలపై చేసిన, దాడులకు ప్రతీకారంగా పౌరులను చంపటం ఆపాలి.

3. చట్టాతీత హత్యలను చేసిన, స్త్రీలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ సాయుధ బలగాలలోని వారిని విచారించి శిక్షించటం ద్వారా అక్కడ తుపాకి పాలన కాక చట్టబద్ధ పాలన జరుగుతుందని ప్రజలకు విశ్వాసం కల్గించాలి.

4. పౌరులకు సంబంధించిన అన్ని విషయాలలోనూ పౌరపాలనాధికారం క్రిందే ఆర్మీ పనిచేయాలి.

5. ఒక ప్రాంతంలో ఒక సైనిక పటాలం వల్ల సంభవించిన మానవ హక్కుల ఉల్లంఘనను విచారించేటప్పుడు ఆ పటాలాన్ని అక్కడ నుంచి బదిలీ చేయాలి. విచారణ నిష్పక్షపాతంగా జరగటానికి ఈ చర్య అవసరం.

6. మిలటరీ బలగాల యొక్క మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సంఘటనలను విచారించేటప్పుడు నిందితులను సాధారణ క్రిమినల్ కోర్టులలోనే విచారించాలి. న్యాయప్రయోజనాల పరిరక్షణ దృష్ట్యా ఈ పద్ధతిని అనుసరించాలి. కోర్టు మార్షల్ పద్ధతి సైన్యంలో క్రమశిక్షణను అమలు చేసే ఉద్దేశంతో రూపొందించబడ్డ సైన్యపు అంతర్గత విషయం. అందువలన సైన్యం వలన జరిగిన మానవహక్కుల ఉల్లంఘన నేరాలను విచారించటానికి ఈ పద్ధతి పనికిరాదు.

7. సాయుధ బలగాలు లేదా పోలీసులు చేసారా అని చెప్పబడుతున్న ప్రతి ఎన్‌కౌంటర్‌ను ఎన్‌హెచ్ఆర్‌సి ఆదేశిక నియమావళికి అనుగుణంగా నిర్వహించాలి.

8. హంతకదళంగా పేరుగడించిన ఎస్ఓజిలాంటి బలగాలను ఖచ్చితమైన క్రమశిక్షణలో ఉంచాలి. హత్యలుచేసి, అటుపిమ్మట లొంగిపోయిన మిలిటెంట్లను ఎస్ఓజిలోకి నియమించటం పూర్తిగా చట్టవ్యతిరేకం మరియు చట్టబద్ధ పాలనను ఉల్లంఘించటం.

9. శాంతియుతంగా నిరసన నిర్వహించేటటువంటి, ప్రదర్శన జరిపేటటువంటి ప్రజల హక్కును మరియు ప్రజల ఇతర ప్రజాస్వామిక హక్కులను గౌరవించాలి.

10. సాయుధ బలగాలు లోయలోని స్త్రీలను చాలా విస్తారంగా వేధిస్తున్నారు. వీరి హింసా కార్యక్రమాలలో ఇది ఒక భాగంగా ఉంది. బలగాల ఈ చర్య కాశ్మీరులోయ అందలి స్త్రీలలో భీతావహాన్ని, అభద్రతను రూపొందించింది. స్త్రీల భద్రత అనే అంశానికి పాలనా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతను యివ్వాలి.

11. గతంలో ఫలితాన్ని యివ్వని కాల్పుల విరమణ ఉండేది. ప్రస్తుతం దానిని కూడా ఎత్తివేస్తారు. నిజాయితీతో కూడిన కాల్పుల విరమణ, శాంతిని తీసుకురాగలిగిన కాల్పుల విరమణ కాశ్మీరు లోయకు అత్యవసరమైన, తప్పని సరియగు చర్య. అయితే ఈ చర్య నిజాయితీతో కూడిన ఒక రాజకీయ ప్రక్రియలో భాగంగా ఉండాలి. ఈ రాజకీయ ప్రక్రియలో జమ్మూ - కాశ్మీర్ ప్రజలకు భాగస్వామ్యం ఉండాలి. మరియు సమస్యను న్యాయబద్ధంగా, సత్వరంగా పరిష్కరించేదిగా ఉండాలి.

12. వారి క్యాంప్‌ల చుట్టూ, కంటోన్మెంటుల చుట్టూ పెట్టుకున్న మందుపాతరలన్నింటిని (ప్రపంచవ్యాపితంగా ఖండించబడినటువంటివి) సైన్యం వెంటనే తొలగించాలి.